క్లుప్తంగా

సీతారామస్వామి మందిరంలో పూజలు



నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో నిర్వహిస్తున్న సీతారామ, లక్ష్మణ, హనుమత్ సమేత అనంత కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి 16 రోజుల పండగ పూజలను భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను మందిర ప్రధానార్చకుడు శ్రీనివాస్‌దీక్షితులు ఆధ్వర్యంలో జరిపారు. ఉభయకర్తలుగా అమరా సత్యరామప్రసాద్, వాసవి దంపతులు వ్యవహరించారు. వెంకటేశ్వర్లుగుప్తా, కిషోర్‌కుమార్, రత్నం, మస్తాన్‌రావు, ఆంజనేయులు, వెంకయ్య, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు పక్కాగా ఏర్పాట్లు



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, ఎస్పీ

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లను పక్కాగా చేపట్టామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. ఎన్నికల ఏర్పాట్లు, బందోబస్తు, విస్తరణ ప్రణాళిక అమలు తదితర అంశాలపై కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్‌ను డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తాతో కలిసి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ గురువారం నిర్వహించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్, ఎస్పీ హాజరయ్యారు. జిల్లాలో 75 శాతం మేర పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్‌కు ఏర్పాట్లు చేశామని కలెక్టర్ చెప్పారు. చేజర్ల మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో నూరు శాతం వెబ్ క్యాస్టింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

పటిష్ట బందోబస్తు

జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టామని ఎస్పీ తెలిపారు. జిల్లాలో ఎన్నికల విధుల్లో బీఎస్ఎఫ్, తమిళనాడు ఆర్మ్‌డ్ పోలీస్ బృందాలు నాలుగు చొప్పున ఉన్నాయని తెలిపారు.

నిందితుడ్ని గుర్తించే పనిలో నిమగ్నం

నెల్లూరు(క్రైమ్): పోక్సో కేసులో నిందితుడ్ని గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. వివరాలు.. నగరంలోని షాదీమంజిల్ సమీపంలో ఏడేళ్ల చిన్నారిపై గుర్తుతెలియని దుండగుడు లైంగిక దాడికి యత్నించిన ఘటనపై చిన్నబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు ఎవరనేది తెలియరాలేదు. దీంతో పోలీసులు చుట్టుపక్కల ఆరాతీసినా.. సీసీ కెమెరాలను పరిశీలించినా ప్రయోజనం లభించలేదు. దీంతో ఈ కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. విభిన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయస్థాయి పోటీలకు చెన్నారెడ్డిపాళెం బాలిక

పొదలకూరు : జాతీయ టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలకు మండలంలోని చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పలుకూరు శ్రీవల్లి ఎంపికైందని క్రికెట్ అకాడమీ కోచ్ మనోహర్ గురువారం తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన శ్రీవల్లిని అండర్–17 టెన్నిస్ బాల్ క్రికెట్ ఏపీ టీమ్‌కు కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ఈ నెల 25 నుంచి 28 వరకు అహ్మదాబాద్‌లో నిర్వహించనున్న జాతీయ టెన్నిస్‌బాల్ క్రికెట్‌లో శ్రీవల్లి ప్రాతినిధ్యం వహించనుంది. దీనిపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నెల్లూరును ప్రథమ స్థానంలో నిలుపుతాం



రోడ్‌షోలో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి, పక్కన ఖలీల్ అహ్మద్

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రానున్న ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా తనను గెలిపిస్తే, సింహపురిని అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలుపుతానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని స్టోన్‌హౌస్‌పేట మెయిన్ రోడ్డు, పప్పులవీధి, నవాబుపేట తదితర ప్రాంతాల్లో పార్టీ సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, పార్టీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, మాళెం సుధీర్‌రెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డి తదితరులతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని విజయసాయిరెడ్డి గురువారం నిర్వహించారు. వీరికి ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నెల్లూరు అభివృద్ధి కోసం తాను ప్రకటించిన మేనిఫెస్టోలోని హామీలను నూరు శాతం అమలు చేస్తామని వెల్లడించారు. నగరంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. సోమశిల హైలెవల్ కెనాల్ నిర్మాణాన్ని పూర్తి చేసి సాగు, తాగునీటిని అందిస్తామని తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులను రైతులు నిల్వ చేసుకునేలా మెగా గోడౌన్లను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. నెల్లూరులో పుట్టి, పెరిగి.. ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన పారిశ్రామికవేత్తలను సొంత జిల్లాకు తీసుకొచ్చి ఇక్కడ పరిశ్రమలను ఏర్పాటు చేయించేలా కృషి చేస్తానన్నారు. ఐటీ పార్కును స్థాపించేందుకు అన్ని విధాలా యత్నిస్తామని వివరించారు. నిరుద్యోగుల కోసం ప్రతి ఆర్నెల్లకోసారి జాబ్‌మేళాలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఎంపీగా తనను.. సిటీ ఎమ్మెల్యేగా ఖలీల్ అహ్మద్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం ఖలీల్ మాట్లాడారు. సామాన్యుడినైన తనకు ఎమ్మెల్యే టికెట్‌ను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కేటాయించారని, ప్రజలకు సేవ చేసే అవకాశమివ్వాలని కోరారు. సంక్షేమ పథకాలను కొనసాగించేందుకు గానూ జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట



ప్రచారం చేస్తున్న ఖలీల్ అహ్మద్

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ.. వారికి అండగా నిలిచిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్ పేర్కొన్నారు. నగరంలోని 44వ డివిజన్లో గల చాకలి వీధి, దండువారివీధి, ఆచారివీధి, శిఖరంవారి వీధి, పెద్దబజార్, యాసిన్‌వీధి, అంజుమన్‌వీధి, అనితాహాల్ సెంటర్ తదితర ప్రాంతాల్లో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. సీఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడప గడపకూ వెళ్లి వివరిస్తున్నామని తెలిపారు. నగరాన్ని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఎంతో అభివృద్ధి చేశారని కొనియాడారు. పేద విద్యార్థులకు విద్య.. కరోనా కష్టకాలంలో ఏ ఒక్కరికైనా ఉచితంగా వైద్యాన్ని నారాయణ అందించారనని ప్రశ్నించారు. నగరాన్ని తానే అభివృద్ధి చేశానంటూ గొప్పలు చెప్పుకొంటున్నారని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా తనను.. ఎంపీగా విజయసాయిరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ నీలి రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలి



ఐదో డివిజన్లో ప్రచారం



14వ డివిజన్లో..



47వ డివిజన్లో..

నెల్లూరు(బారకాసు): నగరంలోని ఐదో డివిజన్లో గల సత్యనారాయణపురం, వైకుంఠపురంలో ఎన్నికల ప్రచారాన్ని కార్పొరేటర్ ఓబిలి రవిచంద్ర, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు గురువారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఓటర్లను పలకరించారు. ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. ఎంపీగా విజయసాయిరెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా ఖలీల్ అహ్మద్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నేతలు సుబ్బారెడ్డి, రమణారెడ్డి, పెంచలరెడ్డి, సురేష్, రమేష్, హరి, వెంకటేష్, కిరణ్, రాజారెడ్డి, మొలకయ్య తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 14వ డివిజన్ పరిధిలో గల ఏసీనగర్, గిరిజన సంఘం తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎంపీగా విజయసాయిరెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా ఖలీల్ అహ్మద్‌ను గెలిపించాలని కోరారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎంపీగా విజయసాయిరెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా ఖలీల్ అహ్మద్‌ను గెలిపించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత ఆనం జయకుమార్‌రెడ్డి కోరారు. ఈ మేరకు నగరంలోని 47వ డివిజన్లో గల కుక్కలగుంట, మహాలక్ష్మమ్మ గుడి, కామాటివీధి, మసీదు సెంటర్, చిన్నబజార్ తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారాన్ని కార్పొరేటర్ రామకృష్ణతో కలిసి ఆయన నిర్వహించారు. నేతలు మాబాషా, రహంతుల్లా, వాజిద్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలను నమ్మే పరిస్థితే లేదు



ప్రచారంలో.. ప్రజలతో మమేకమైన సునందరెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ప్రతిపక్ష పార్టీలు ఎన్ని హామీలిచ్చినా, వీటిని విశ్వసించే స్థితిలో ప్రజలు లేరని.. సంక్షేమ పాలనతో ప్రజల హృదయాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి సతీమణి సునంద పేర్కొన్నారు. నగరంలోని 49వ డివిజన్లో కార్పొరేటర్ వందవాసి రాజేశ్వరి, పార్టీ డివిజన్ ఇన్‌చార్జి వందవాసి రంగ, బొందిలి కార్పొరేషన్ డైరెక్టర్ కస్తూరితో కలిసి గురువారం నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆమె మాట్లాడారు. 2019లో ఇచ్చిన హామీల్లో 99 శాతం మేర అమలు చేసిన ఘనత సీఎంకే దక్కుతుందని కొనియాడారు. ఎంపీగా విజయసాయిరెడ్డి.. నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా ఖలీల్ అహ్మద్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం డివిజన్లోని మహాలక్ష్మమ్మ, మారెమ్మ తల్లి ఆలయాల్లో పూజలు చేశారు. పార్టీ జిల్లా మహిళా విభాగ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, నేతలు షబ్బీర్, బొమ్మిడి శ్రీనివాస్, వెంకటేష్, ప్రవీణ్, కర్తం జ్యోతి, పార్టీ రాష్ట్ర మహిళా విభాగ కార్యదర్శి హిమబిందు, ఉపాధ్యక్షులు మాధవి వర్మ, బెందాళం పద్మావతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

12న క్రికెట్ జట్ల ఎంపిక

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా అండర్ – 19 బాలుర క్రికెట్ జట్టును ఆదివారం ఎంపిక చేయనున్నామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి నిఖిలేశ్వర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బుజబుజనెల్లూరులోని క్రికెట్ అకాడమీ గ్రౌండ్స్‌లో ఎంపికలను నిర్వహించనున్నామని చెప్పారు. అండర్ – 15, 19 బాలబాలికల ఎంపికలను మధ్యాహ్నం మూడు నుంచి నిర్వహించనున్నామని పేర్కొన్నారు. క్రీడాకారులు డ్రస్‌కోడ్‌ను పాటించాలని, సొంత క్రికెట్ కిట్, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డును తీసుకు రావాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం తథ్యం



నెల్లూరు సిటీ: రాష్ట్రంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావడం తథ్యమని రైల్వే బోర్డు సభ్యుడు, దళిత నేత స్వర్ణ వెంకయ్య పేర్కొన్నారు. పార్టీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా కందమూరు గిరిజన కాలనీలో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని.. టీడీపీ వస్తే అవి నిలిచిపోయే ప్రమాదం ఉందని చెప్పారు. నేతలు పాలకీర్తి రవి, బద్దిపూడి వెంకట్రావు, శ్రీనివాసులు, శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగర నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను కల్పించడంతో పాటు ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు చేపట్టాలని ఆర్వో, కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. నగరంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులను గురువారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. తనిఖీలు చేసి నివేదికలను అందజేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వీల్‌చైర్ వెళ్లేందుకు అనువైన ర్యాంప్ ఏర్పాటు, విద్యుద్దీపాలు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు తదితరాలను ఏర్పాటు చేయాలని చెప్పారు.

పోస్టల్ కాలనీలో చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన పోస్టల్ కాలనీలో గురువారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. పోస్టల్ కాలనీలోని ఆరో వీధిలో నివాసం ఉంటున్న మీనాకుమారి తన సోదరి సంధ్యతో కలిసి ఇటీవల రాపూరు వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తలుపులను పగలగొట్టి బీరువాలోని సుమారు రూ.50 వేల నగదు, ఎనిమిది సవర్ల బంగారు ఆభరణాలను అపహరించుకెళ్లారు. ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించిన స్థానికులు ఆమెకు విషయాన్ని ఫోన్లో తెలియజేశారు. దీంతో ఆమె తన సోదరితో కలిసి హుటాహుటిన నెల్లూరు చేరుకొని, చోరీ ఘటనపై దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆదాలకు మద్దతుగా ప్రచారం



కరపత్రాన్ని అందజేసి.. ఓటును అభ్యర్థిస్తున్న హిమబిందు

నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని ఆయన కుమార్తె ఆదాల హిమబిందు కోరారు. నియోజకవర్గంలోని 12వ డివిజన్లో జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, మేయర్ స్రవంతితో కలిసి ఎన్నికల ప్రచారాన్ని గురువారం ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మానవత్వానికి మారుపేరైన ఆదాలకే తమ ఓటు అని ప్రజలు చెప్పడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. తొమ్మిది నెలల కాలంలో రూ.150 కోట్లతో నియోజకవర్గాన్ని ఆదాల అభివృద్ధి చేశారని తెలిపారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల, ఎంపీగా విజయసాయిరెడ్డిని గెలిపించాలని కోరారు. కొండ్రెడ్డి భరత్‌కుమార్, క్లస్టర్ – 1 అధ్యక్షుడు రామిరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు జయవర్ధన్, పార్టీ నగర మహిళాధ్యక్షురాలు కాకుటూరు లక్ష్మీసునంద, ఎమ్మెస్సెమ్ఈ డైరెక్టర్ పాశం శ్రీనివాస్, పార్టీ నగర ఉపాధ్యక్షుడు వేలూరు శ్రీధర్‌రెడ్డి, టీఎల్ఎఫ్ అధ్యక్షులు హరితారెడ్డి, భార్గవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేదురుమల్లికి ఘన నివాళి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): దివంగత సీఎం నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి వర్ధంతిని నగరంలోని ఇందిరాభవన్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అనంతరం పేదలకు వస్త్రాలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి కొప్పుల రాజును సాల్వేషన్ ఆర్మీ చర్చి నిర్వాహకులు ఆశీర్వదించారు. డీసీసీ అధ్యక్షుడు దేవకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల నిర్వహణపై అవగాహన

నెల్లూరు(బారకాసు): నెల్లూరు సిటీ నియోజకవర్గంలో ఈవీఎంల నిర్వహణపై అవగాహన సదస్సును నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో గల కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో ఆర్వో, కమిషనర్ వికాస్ మర్మత్ గురువారం నిర్వహించారు. ఈవీఎంల పంపిణీ, స్వీకరణ, ఇన్‌స్టలేషన్, ఓటింగ్ ప్రక్రియ, భద్రపర్చడం తదితర అంశాలపై సెక్టోరల్ అధికారులు, బీఎల్వోలకు అవగాహన కల్పించారు.

ముగిసిన పోస్టల్ బ్యాలెట్

కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహిస్తున్న పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ముగిసింది. సిటీ నియోజకవర్గంలో 2745 మందికి గానూ 2698 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా, పోలింగ్ 98.28 శాతంగా నమోదైంది.





వేదగిరిలో 16 నుంచి బ్రహ్మోత్సవాలు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ తదితరులు

నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలను ఈ నెల 16 నుంచి 26 వరకు నిర్వహించనున్నారని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆర్డీఓ మలోల పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణపై నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో గురువారం నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని సూచించారు. మెడికల్ క్యాంపుల ఏర్పాటుతో పాటు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. పారిశుధ్య సమస్యలు తలెత్తకూడదని చెప్పారు. తొలుత బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈఓ గిరికృష్ణ, విద్యుత్ శాఖ ఏడీ భానునాయక్, పీహెచ్‌సీ వైద్యుడు రవీంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమణ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు తుంగలో..

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కొందరు బీఎల్వోలు
- టీడీపీ నేతలకు ఓటరు స్లిప్పుల అందజేత
- వైఎస్సార్‌సీపీ నేతలు ఫిర్యాదు చేసినా స్పందనేదీ..?

నెల్లూరు(బారకాసు): ఈ ఎన్నికల్లోనూ పరాభవం తప్పదనే సంకేతాలతో ఎలాంటి అడ్డదారులు తొక్కేందుకైనా టీడీపీ వెనుకాడటంలేదు. కొందరు అధికారులను వీరు ప్రలోభాలకు గురిచేసి తమ పక్షాన పనిచేసేలా వికృత చేష్టలకు తెరలేపారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో జరిగిన ఘటనే దీనికి ఉదాహరణగా నిలుస్తోంది.

వీడియో చిత్రీకరణతో వెలుగులోకి..

సంబంధిత బీఎల్వోలు ఆయా ప్రాంతాల్లోని టీడీపీ కార్యాలయాలకు వెళ్లి ఆ పార్టీ నేతలకు ఓటరు స్లిప్పులను అందజేస్తున్న వ్యవహారాన్ని కొందరు చిత్రీకరించడంతో వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు వెంటనే సంబంధిత రిటర్నింగ్ అధికారికి ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. అయితే నామమాత్రంగా చర్యలు చేపట్టడంపై సదరు అధికారిపై వీరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీని బట్టి కొందరు అధికారులు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ.. టీడీపీ నేతలకు అనుకూలంగా పనిచేస్తున్నారనే విషయం స్పష్టమవుతోంది.

ఏడుగురికి గానూ ఒక్కరిపైనే చర్యలు

ఓటరు స్లిప్పుల పంపిణీ వ్యవహారంలో ఏడుగురు బీఎల్వోలకు గానూ ఒక్కర్నే సస్పెండ్ చేశారు. మిగిలిన ఆరుగురికి షోకాజ్ నోటీసుల జారీకే పరిమితమయ్యారు. దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసేందుకు వైఎస్సార్‌సీపీ నేతలు సమాయత్తమవుతున్నారు.

పచ్చనేతలకు ఓటరు స్లిప్పులు..!

ఓటర్లకు ఓటు స్లిప్పుల పంపిణీ ప్రక్రియను ప్రారంభించారు. వీటి పంపిణీ బాధ్యతను బీఎల్వోలకు అప్పగించారు. వాస్తవానికి ఈ స్లిప్పులను సంబంధిత బీఎల్వోలు వారికి కేటాయించిన ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి ఎవరి పేరైతే ఉందో వారికి అందజేసి సంతకాలు చేయించుకోవాలి. అయితే కొందరు బీఎల్వోలు టీడీపీ నేతలకు అమ్ముడుబోయి.. పెద్ద మొత్తంలో నగదు పొంది తమ వద్ద ఉన్న ఓటరు స్లిప్పులను వారికి అందజేస్తున్నారు. తమ వద్ద ఉన్న ఫార్మాట్‌లో అన్ని సంతకాలు ఒకే పేరుతో ఉండటం గమనార్హం. నగరపాలక సంస్థలోని 30, 40, 46, 49వ డివిజన్లలో ఈ ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి.